సాక్షి విజయనగరం

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



సమస్యల పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే వినతులను మరింత మెరుగ్గా పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు.



విజిలెన్స్ దాడులు

పాలకొండ మండలం అట్టలి గ్రామ సమీపంలోని కొండ కంకరను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడిచేశారు.



జిల్లాస్థాయి ఉత్తమ గురువులు వీరే..

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది.

-IIలో

● సీతాఫలం సిరి



సీతాఫలం పంట గిరిజన రైతులకు సిరులు కురిపిస్తోంది. పంట సాగుకు ప్రకృతి అనుకూలించడంతో దిగుబడులు పెరిగాయి. ఏజెన్సీలో ఏ గ్రామంలో చూసినా సీతాఫలాలే కనిపిస్తున్నాయి. గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, భామిని మండలాల్లోని వారపు సంతల్లో సీతాఫలాల విక్రయాలు జోరందుకున్నాయి. మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి కావిడ పండ్లను రూ.600కు కొనుగోలు చేస్తున్నట్టు గిరిజన రైతులు చెబుతున్నారు.

– గుమ్మలక్ష్మీపురం

ధారపైడితల్లి సొమ్ము ▶ రౌడీమూకల దోపిడీ

- అమ్మవారి నగలు, రూ.6 లక్షల వరకూ విరాళాలు హుష్‌కాకి
- లోగుట్టు రట్టుగాకుండా తెరపైకి రెల్లి భూవివాదం
- ఎమ్మెల్యే కడుబండిపై అవినీతి బురదజల్లుతూ దుష్ప్రచారం
- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/కొత్తవలస:

రాజకీయ పబ్బం కోసం ఒకవైపు టీడీపీ నాయకులు, మరోవైపు శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వ్యతిరేకులు ధారపైడితల్లి అమ్మవారి సొమ్మును నిలువుదోపిడీ చేస్తున్న రౌడీమూకలను రెచ్చగొడుతున్నారు. రెండేళ్ల కిందట కరోనా సమయంలో అమ్మవారి నగలను, రూ.6 లక్షల వరకూ భక్తుల విరాళాల సొమ్మును మాయం చేసిన చోరీ గుట్టు రట్టుగాకుండా సదరు రౌడీ మూకలు ఇదే అవకాశంగా రెచ్చిపోతున్నాయి. వీరిని తట్టుకోలేక పూజారి, అప్పన్నదొరపాలెం గ్రామ సర్పంచి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆగట్లేదు. చివరకు ఆ గ్రామస్తుల విన్నపంతో అమ్మవారి ఆలయాన్ని దేవదాయశాఖకు స్వాధీనం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. అమ్మవారి ఆలయ సొమ్మును నిలువుదోపిడీ చేయడానికి అలవాటుపడిన మూకలకు ఇది మింగుడుపడలేదు. దీంతో 2013కు ముందే క్రయవిక్రయాలు జరిగిన, 2014లో నాలా రుసుం చెల్లించి భూమార్పిడి చేసిన రెల్లి భూముల వివాదాన్ని తెరపైకి తెచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే బాధ్యతలు చేపట్టిన కడుబండి శ్రీనివాసరావుపై అవినీతి బురద జల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. దీన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఖండించారు. సోమవారం కొత్తవలసలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గిరిజనులంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తమ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఎంతో ప్రీతి అని ఒబ్బిన నాయుడు గుర్తు చేశారు. అప్పన్నదొరపాలెం గిరిజనుల్లో కొందరు టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే అంటే గిట్టనివారి ఉచ్చులో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి గ్రామ దేవత దారపైడితల్లిమ్మ అమ్మవారి గుడిని దేవదాయశాఖకు స్వాధీనం చేసే విషయంలో గానీ, రెల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 289లోని భూముల లావాదేవీలతో గానీ ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. అప్పన్నదొరపాలెం గ్రామ సర్పంచ్ జోడి రాములమ్మ మాట్లాడుతూ గ్రామంలో ధారపైడితల్లి అమ్మవారి గుడి హుండీ ఆదాయం దుర్వినియోగమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హుండీ ఆదాయాన్ని కొంతమంది తమ సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. వారు కనీసం ఆలయ అభివృద్ధికి ఏమాత్రం సహకరించట్లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అమ్మవారి ఆలయాన్ని స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేయాలని కోరుతూ తాము గతంలోనే దేవదాయ శాఖకు లేఖ రాశామని వెల్లడించారు. అమ్మవారి ఆలయానికి రెవెన్యూ రికార్డుల ప్రకారం సెంటు భూమి కూడా లేదన్నారు. ఈ గుడి అభివృద్ధి కోసం మైత్రీ సంస్థ యజమానులు రెండు ఎకరాల భూమి ఇచ్చేందుకు ముందుకొచ్చారని సర్పంచి వెల్లడించారు. ఇప్పటికైనా తమ గ్రామ గిరిజనులు నిజాలేమిటో తెలుసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, రెల్లి గ్రామ సర్పంచ్ అల్లం సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మేలాస్త్రీ అప్పారావు, బొంతల వెంకటరావు, ధారపైడితల్లి అమ్మవారి గుడి పూజారి జోడి దేముడు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పూజారి తదితరులు

ముగ్గురు విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు) బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ప్రక్రియలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ముగ్గురికి గ్రూప్–4 ఉద్యోగాలు లభించాయి. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ అభ్యర్థులను ఎంపిక చేసింది. అంధుల విభాగంలో నైట్ వాచ్‌మన్‌గా ఎంపికైన సిర్లు చిన్నారావును జిల్లా పరిషత్‌కు, శారీరక ప్రతిభావంతు లు విభాగంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఎంపికైన చింతపల్లి రమణను విద్యాశాఖకు, ఏఎస్ఎంగా ఎంపికైన గంటల ఈశ్వరమ్మను ఆయుష్ శాఖకు కేటాయించారు. వారికి కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం స్పందన కార్యక్రమంలో ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమాధికారి జీవీబీ జగదీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలకు సంబంధించిన ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తలనీలాల వేలం రూ.33.15 లక్షలకు ఖరారు

- రామతీర్థంలో వేలంపాట నిర్వహణ

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్య క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో తలనీలాలు, నిత్యావసర సరుకులు, కొబ్బరి చెక్కలు, పార్కింగ్ తదితర వాటికి సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం ప్రక్రియ పూర్తయింది. దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి పి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో ముందుగా టెండర్లు నిర్వహించి అనంతరం వేలం పాటను ప్రారంభించారు. తలనీలాలు సేకరించేందుకు గుంటూరు జిల్లాకు చెందిన మేదర ఏడుకొండలు రూ.33,15,000, కొబ్బరి చెక్కల సేకరించేందుకు, కాకినాడకు చెందిన గింజల హరీష్ రూ.13,10,000కు దక్కించుకున్నారు. స్వామి వారి ప్రసాదాల తయారీకు అవసరమైన నిత్యావసర దినుసుల సరఫరాకు రణస్థలం మండలానికి చెందిన రాఘవేంద్ర తక్కువ ధరకు కోట్ చేశారు. పార్కింగ్ స్టాండ్ నిర్వహణను జగ్గరాజుపేటకు చెందిన కల్యాణపు రమణ దక్కించుకున్నారు. నిత్యాన్నదానానికి కూరగాయలు సరఫరా చేసేందుకు విజయనగరం, గుర్లకు చెందిన రాజబాబు, శనపతి శ్రీనివాసరావు వేలంలో దక్కించుకున్నారు. ఏడాది కాలానికి టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించినట్టు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్న రామతీర్థం దేవస్థానం అధికారులు

పాలనాంశాలపై సంపూర్ణ అవగాహన అవసరం

- పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ జె.మురళి
- జెడ్పీ సమావేశ మందిరంలో కార్యదర్శులకు రెండో దశ శిక్షణ

విజయనగరం రూరల్: క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అన్ని రకాల పరిపాలనాపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలరని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్) డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న రిఫ్రెషర్ రెండో దశ శిక్షణ జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళీ ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీరాజ్ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించా రు. జిల్లా ఆఫీస్ మాన్యువల్, ఎన్ఆర్ఈజీఎస్ లేఅవుట్ల అనుమతులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్వమిత్వ, డ్రాఫ్టింగ్ తదితర అంశాలను వివరించారు. కిందిస్థాయి నుంచి జిల్లా, ఆపై స్థాయి వరకు పరిపాలనా అంశాల్లో జరిగే మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు.

ప్రభుత్వం జారీచేసే జీఓలు, మెమో సర్క్యులర్ల గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా పరిపాలనాపరమైన అంశాలపై పీపీటీ ద్వారా పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. శిక్షణలో విజయనగరం జిల్లా నుంచి 150 మంది, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 100 మంది హాజరయ్యారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళి

క్లుప్తంగా

విజిలెన్స్ దాడులు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో గల కొండ వద్ద కంకరను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేపట్టారు. ఈ క్రమంలో కంకర తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సహాయక జియాలజిస్టు ఎం.సురేష్‌కుమార్, సీఐ సతీష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా 2200 క్యూబిక్ మీటర్ల కంకర తరలించినట్లు గుర్తించి కేసునమోదు చేశామన్నారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గో హత్యపై ఆరుగురిపై కేసు

పార్వతీపురంటౌన్: మండలంలోని బాలగుడబ గ్రామంలో గోవును చంపిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సింహాచలం చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ రైతు మువ్వల తిరుపతిరావు పశువుల పాకలో ఉన్న గోవు కనబడకపోవడంతో గ్రామమంతా వెతికాడు. గ్రామ శివారులో ఉన్న జీడితోటలో ఆవుమాంసం, తోలును గమనించి తోటలో ఉన్న కొంతమంది వ్యక్తులపై అనుమానం వచ్చి ప్రశ్నించగా అంతా పరారయ్యారు. దీంతో వారిపై బాధిత రైతు ఫిర్యాదు చేయగా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరింత మెరుగ్గా సమస్యల పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

● కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే వినతులను మరింత మెరుగ్గా పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. అర్జీదారులను శతశాతం సంతృప్తి పరచడం లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించి వివిధ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న వినతులపై సమీక్షించారు. ప్రతి సమస్యను విభిన్నంగా ఆలోచించి పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా సమస్యలు పరిష్కరించాలని, గడువు దాటనివ్వవద్దని స్పష్టం చేశారు.

157 వినతుల స్వీకరణ

కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి మొత్తం 157 వినతులు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిదుదారులకు సత్వర న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి, తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చట్టపరిధిలో వారికి న్యాయం చేయాలని, ఆదేశించారు. స్పందనలో భాగంగా 26 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి


అనూష మృతదేహం

పాలకొండ: నగపంచాయతీలోని గారమ్మకాలనీలో నివాసం ఉంటున్న కూనబిల్లి అనూష (21) సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనపై ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనూషకు గడిచిన మే నెలలో వివాహం జరిగింది. ఆషాడం మాసంలో పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. సోమవారం తండ్రి దుర్గారావు కూలి పనికి వెల్ల, తల్లి మార్కెట్‌కు వెళ్లారు. తల్లి మార్కెట్ నుంచి తిరిగి ఇంటికి వచ్చే సమయానికి కుమార్తె ఉరివేసుకున్నట్లు తల్లి ఫిర్యాదులో మృతురాలి తల్లి పేర్కొంది. ఈ మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించామని, మంగళవారం రిపోర్టు వస్తుందని ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

చెట్టుపై నుంచి జారిపడి యువకుడు..


కనకరావు(ఫైల్)

భోగాపురం: భోగాపురం పంచాయతీ కొయ్యపేట గ్రామంలో చెట్టుపై నుంచి జారిపడి సోమవారం ఓ యువకుడు మృతిచెందాడు. భోగాపురం పంచాయతీ కొయ్యపేట గ్రామానికి చెందిన బాకి కనకరావు(32) పూల వ్యాపారం చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని యాజమానుల పూలతోటల వద్దకు వెళ్లి పూలు కొనుగోలు చేసి వాటిని విశాఖపట్నం జిల్లా అనంతపురం గ్రామానికి తీసుకువెళ్లి అధిక ధరకు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఒక యాజమాని తోటలో ఉన్న సంపంగి చెట్టు ఎక్కి పూలు కోస్తూ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందకు పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య సూరమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎసై కృష్ణమూర్తి తెలిపారు.

ఉపసర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం

పాచిపెంట: మండలంలోని మాతుమూరు పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల అధికారులు సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలో స్థానిక సర్పంచ్ బోను ఉషారాణి నేతత్వంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దళాయి గంగమ్మను ఉపసర్పంచ్‌గా వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన గంగమ్మకు సర్పంచ్ ఉషారాణి, ఎంపీటీసీ రొంగలి మోహన రవళి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలు నాయుడు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

మృతదేహంతో నిరసన


మృతదేహంతో నిరసన తెలుపుతున్న ముస్లిం కుటుంబాలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో ముస్లింలకు శ్మశాన వాటిక స్థలం లేకపోవడంతో ఆదివారం ముస్లిం స్త్రీ మృతదేహంతో నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన ముస్లింలకు శ్మశాన వాటికకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కొన్నేళ్లుగా కోరుతున్నప్పటికీ కేటాయించలేదని ముస్లింలు ఈ సందర్భంగా వాపోయారు. సోమవారం ముస్లిం మహిళ మృతదేహంతో ముస్లింలు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తహసీల్దార్ దృష్టికి రావడంతో గ్రామ సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, అప్పలనాయుడు దంపతులు స్పందించి ముస్లిం పెద్దలతో సంప్రదింపులు నిర్వహించి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. పొలమరశెట్టి జగ్గారావు కళ్లం సమీపంలో ముస్లింలకు ఐదు సెంట్ల భూమిని గుర్తించి శ్మశాన వాటికకు కేటాయిస్తామన్నారు. అలాగే కేటాయించిన స్థలంలో ఎంపీపీ లేదా పంచాయతీ నిధులతో ప్రహరీ నిర్మిస్తామని సర్పంచ్ దంపతులు చెప్పడంతో ముస్లిం పెద్దలు ఎస్‌కె యాకూబ్, ఎస్‌కె ఉస్మాన్, ఎస్‌కె అబ్దుల్ సమక్షంలో సమస్య పరిష్కారమైంది. దీంతో మృతిచెందిన ముస్లిం స్త్రీని శ్మశానవాటికకు కేటాయించిన స్థలంలో ఖననం చేశారు.

జిల్లాస్థాయి ఉత్తమ గురువులు వీరే..

● ఆంగ్లమాధ్యమ టీచర్ల ప్రావీణ్య పరీక్ష అవార్డులకు మరో నలుగురు ఎంపిక

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. వివిధ కేటగిరీల్లో 66 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసింది. ఆంగ్లమాధ్యమ ఉపాధ్యాయులకు నిర్వహించిన పురస్కారపరీక్ష నుంచిఎంపిక చేసిన మరో నలుగురికి ప్రత్యేక అవార్డులు ప్రకటించింది. ఈ ఏడాది జిల్లాలోని 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు విజయనగరం కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే ఉపాధ్యాయదినోత్సవ కార్యక్రమంలో అవార్డులు అందజేస్తామని డీఈఓ బీ.లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఏడాది వినూత్నంగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు విద్యాశాఖ అధికారుల బృందం వ్యక్తిగత పరిశీలనలో (బోధన, విద్యాభివృద్ధి వంటి అంశాల్లో ఉత్తమ ప్రమాణాలు) గుర్తించిన ఉపాధ్యాయులను పురస్కారాలకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. కేటగిరీ వారీగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రధానోపాధ్యాయులు గ్రేడ్–2 కేటగిరిలో(12 మంది)

రుక్షణ ప్రవీన్ (ప్రిన్సిపాల్, ఏపీమోడల్ స్కూల్ విజయనగరం), ఎ.శ్రీనివాస రావు (పీజీ హెచ్‌ఎం, టీడబ్ల్యూహెచ్‌ఎస్ బాలురు, కే.జీ.పూడి), టి.జయశ్రీ (ప్రిన్సిపాల్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ వియ్యంపేట), బి.రోహిణి (స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, వంగర), ఎం.ఎ.సూర్యనారాయణ (జెడ్పీహెచ్‌ఎస్, వంగర), బి.ఉమామహేశ్వరరావు (జెడ్పీహెచ్‌ఎస్ బొండపల్లి), సీహెచ్.పద్మావతి (జెడ్పీహెచ్‌ఎస్, కుమరాం), దతిత్త మధుసూదనరావు (జెడ్పీహెచ్‌ఎస్, పిరిడి), ఎస్.సత్యనారాయణ (జెడ్పీహెచ్‌ఎస్, పాగిరి), బి.రవిశంకర్ (జెడ్పీహెచ్‌ఎస్, మందరాడ), కె.విక్టోరియా రాణి (జెడ్పీహెచ్‌ఎస్, ద్వారపూడి), సీహెచ్.అరుణకుమారి (జెడ్పీహెచ్‌ఎస్, పతివాడ).

స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో (23 మంది)

ఎం.రమణ (తెలుగు, జెడ్పీహెచ్‌ఎస్ బుదరాయినవలస), బి.రాము (ఇంగ్లిష్, జెడ్పీహెచ్‌ఎస్, గొల్లాది), టి.నాగరాజు (సోషల్, జెడ్పీహెచ్‌ఎస్, గరుగుబిల్లి), పండి సురేష్‌కుమార్ (బయాలజీ, ఏపీబాలయోగి గురుకులం, బాడంగి), కరకవలస శ్రీదేవి (ఇంగ్లిష్, ఎంపీయూపీ, జె.ఎన్.పురం), కోరాడ గోపాలరావు (పీడీ, కస్పా స్కూల్ విజయనగరం), కె.వి.నాగలక్ష్మి (తెలుగు, జెడ్పీహెచ్‌ఎస్ కొండవెలగాడ), అరసాడ సురేంద్ర (బయాలజీ, జెడ్పీహెచ్‌ఎస్, ధర్మవరం), రేవల్ల ఆదినారాయణ (తెలుగు, జెడ్పీహెచ్‌ఎస్ జరజాపుపేట), కె.షణ్ముఖరావు (ఇంగ్లిష్, జెడ్పీహెచ్‌ఎస్ ముంజేరు), బి.హేమలత (ఇంగ్లిష్, జెడ్పీహెచ్‌ఎస్ రాజాం), కె.మధుసూదనరావు (టీజీటీ మేథ్స్, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్ నెల్లిమర్ల), బి.మహేశ్వరరావు (మాథ్స్, జెడ్పీహెచ్‌ఎస్, ఆర్.సి.పురం), జె.పోలరావు (సోషల్, జెడ్పీహెచ్‌ఎస్, జిన్నాం), పి.శ్రీదేవి (టీజీటీ సైన్స్, ఏపీమోడల్ స్కూల్ మదనాపురం), అజ్జాడ నరేష్ (ఫిజికల్ సైన్స్, జెడ్పీహెచ్‌ఎస్ కొట్యాడ), ఎస్.సులేఖ (సీఆర్‌టీ ఇంగ్లిష్, కేజీబీవీ విజయనగరం), టి.కిషోర్ (హిందీ, ట్రైబల్ వెల్ఫేర్ బాలుర స్కూల్, ఎస్.కోట), వి.రామచంద్రుడు (పీడీ, ట్రైబుల్ వెల్ఫేర్ బాలు, నెల్లిమర్ల), టి.అరుణ (సీఆర్‌టీ మాథ్స్, కేజీబీవీ భోగాపురం), జి.సత్యవతి (పీజీటీ ఇంగ్లిష్, కేజీబీవీ ఎల్.కోట), పల్లి శ్రీనివాసరావు (ఇంగ్లిష్, జెడ్పీహెచ్‌ఎస్ గొట్లాం).

సెకండరీ గ్రేడ్ టీచర్స్ కేటగిరీలో (31 మంది)

ఎం.ఉమారాణి (ఒకేషనల్, కస్పా విజయనగరం), ఏఎస్‌రోహిణి (ఎంసీపీఎస్, కంచర్లవారి వీధి విజయనగరం), ప్రేమ రామచంద్రరావు (కంటకాపల్లి), బాల మోహనరావు (లక్ష్మిపేట), బంకపల్లి శివప్రసాదరావు (చినమధుపాడ, గంట్యాడ మండలం), యు.ప్రమీలారాణి (చింతలవలస), యూ.ఉమాదేవి (కొండ్రాజుపేట), బీ.కాశిరాజు (గొల్లపేట), సీహెచ్.రాము (పూడివలస), యలకల పైడిరాజు (కొయ్యకొండవలస), పూడి మహేష్ (పనసలపూడి), శంబర శారద (అలజంగి), టి.రమేష్ (సరయ్యవలస), తీడ రామారావు (మల్లునాయుడు పేట), వల్లూరి రామబ్రహ్మం (కొటారుబిల్లి జంక్షన్), బి.నాగేశ్వరరావు (గోషాడ), ఎం.వి.సత్యనారాయణ (అట్టాడ, జామి మండలం), దోసి లక్ష్మి (గాంధీనగర్), డోకుల నాగమణి (కేఎంవీపాలెం), బి.గోపినరసింగరావు (జీజీవలస), దన్నాన అప్పలనాయుడు (బైరిపురం), కె.రాజేష్ (చినపల్లిపేట), కప్పల అప్పలరాజు (పోరాం), బి.భువనేశ్వరరావు (మజ్జిరా మునిపేట), వి.మహలక్ష్మి (మిర్తివలస), కాపుగంటి జగదీశ్వరి (టీవీవర, ఎస్.కోట), యేగిరెడ్డి అప్పలనాయుడు (నెమలాం), పి.సత్యనారాయణ (చామలాపల్లి), బి.ఆదెమ్మ (టీడబ్ల్యూఏ హెచ్‌ఎస్ బాలికల, విజయనగరం), ఆర్.అప్పలనరసమ్మ (ఎంపీయూపీ తాలాడ).

ఇంగ్లిష్ మాధ్యమ టీచర్ల ప్రావీణ్య పరీక్ష అవార్డులు

తెన్నేటి శ్రీనివాస్ (మేథ్స్ స్కూల్ అసిస్టెంట్, ఏపీ మోడల్ స్కూల్, విజయనగరం), బుద్ధరాజు హరికిషోర్ (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ కామాక్షినగర్, విజయనగరం), దారా అనురాధ (బయాలజీ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ చీపురుపల్లి), పెంటపాటి రాజేష్ (సోషల్ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ గాజులరేగ, విజయనగరం).

320 లీటర్ల సారా, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పార్వతీపురం టౌన్: మండలంలోని అడ్డూరివలస గ్రామం వద్ద ఎస్‌ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సోమవారం 320 లీటర్ల సారాతో పాటు రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సీఐ జి.సతీష్ మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఒడిశా రాష్ట్రం నుంచి రెండు ద్విచక్రవాహనాలపై 320లీటర్ల సారా రవాణా చేస్తుండగా ఒక నిందితుడు వెలగాడ అభిషేక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నిందితుడు దేవుపల్లి అరుణ్ పరారీలో ఉన్నాడని సాధ్యమైనంత త్వరలో అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. అభిషేక్‌పై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం ఎస్‌ఈబీ స్టేషన్‌కు తరలించామని వివరించారు. దాడుల్లో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు వాసికి రాష్ట్రపతి బంగారు పతకం


రాష్ట్రపతితో కూడిన విద్యార్థి బృందంలో ఉన్న జగన్

సాలూరు: పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన బీజీవీఎస్ జగన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. పురస్కార గ్రహీత జగన్ తండ్రి పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ పూజారి నారాయణాచార్యులు ఈ మేరకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్ నేవీలో అసిస్టెంట్ కమాండెంట్ ఆఫీసర్‌గా చేరారు. బిలాస్‌పూర్ యూనివర్సిటీలో ఫార్మశీలో మాస్టర్స్ డిగ్రీలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ నెల 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనివర్సిటీ పదవ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి చేతుల మీదుగా జగన్ గోల్డ్‌మెడల్ స్వీకరించాడు. తమ బిడ్డ దేశసేవలో, గొప్పస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని తల్లిదండ్రులు నారాయణరావు, రాధలు ఈ సందర్భంగా అన్నారు.

వినతుల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించడమే లక్ష్యమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోకలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్‌లు ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక అంశాలపై 90 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం


ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకుని, పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ, సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.వీ ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం


ఈశ్వరమ్మ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలోని రేవళ్ల చెరువుకు వెళ్లేదారిలో మహిళ మృతదేహం లభ్యమైంది. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు దుర్వాసన రావడంతో మృతదేహం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తొలుత గుర్తుతెలియని మహిళ మృతదేహంగా భావించారు. అనంతరం పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఎవరైనా ఇటీవల తప్పిపోయినట్లు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులపై ఆరా తీశారు. గ్రామ సచివాలయ మహిళా కానిస్టేబళ్లను అప్రమత్తం చేయడంతో మృతదేహాన్ని బూరాడ గ్రామానికి చెందిన పాగిరి ఈశ్వరమ్మ (51)గా గుర్తించి కుటుంబసభ్యుల వద్ద వివరాలు తెలుసుకున్నారు. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో గతంలో పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తరువాత మళ్లీ ఇంటికి చేరేదని ఆమె సోదరుడు సూర్యనారాయణ తెలిపాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్సై పి.నీలావతి తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹148	₹268	₹ 276

